## క్లుప్తంగా

### క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష లతీష్

**అగనంపూడి:** జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష లతీష్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. గొంతిన నూకరాజు సంస్మరణార్థం ఆయన కుమారులు శంకర్, సుధాకర్‌లు ఈ క్రీడా దుస్తులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అనూష మాట్లాడుతూ విద్య, క్రీడాభివృద్ధిలో సంస్థలు, యువజన సంఘాలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కాంతమ్, నాయకులు గుడివాడ లతీష్, గొంతిన నూకరాజు, ఫిజికల్ డైరెక్టర్ షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

### తిరుమలనగర్ అసోసియేషన్ స్వచ్ఛాంధ్ర అవార్డు



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు

**కూర్మన్నపాలెం:** పరిశుభ్రత కోసం నిత్యం శ్రమిస్తున్న తిరుమలనగర్ అసోసియేషన్‌కు 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' అవార్డు లభించింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అసోసియేషన్ ప్రతినిధులు ఈ అవార్డును అందుకున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు పరమానందం, ఎ. సన్యాసిరావు, ఎం. సాంబశివరావు తదితరులు సీఎం నుంచి ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

### గాయపడిన మహిళకు సత్వర చికిత్స



ప్రమాదంలో గాయపడ్డ రాజేశ్వరికి వైద్య సేవలు అందిస్తున్న 108 భవ్య సిబ్బంది

**మహారాణిపేట:** పెదగంట్యాడ సమీపంలోని శ్రీనగర్ బ్రిడ్జిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బి. రాజేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. గాజువాకలో మార్కెట్ ముగించుకుని స్కూటీపై స్వగ్రామం నరవకు వెళ్తున్న రాజేశ్వరిని లారీ బలంగా ఢీకొట్టడంతో ఆమె కుడి కాలు నుజ్జు, నుజ్జు అయ్యింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 సేవలకు కాల్ చేయగా, పెదగంట్యాడ 108 అంబులెన్స్ సిబ్బంది - ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ దూది రమేష్, పైలట్ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారు రాజేశ్వరికి సత్వర వైద్యాన్ని అందించి, చికిత్స నిమిత్తం కేజీహెచ్ తరలించారు.

### 40వ రోజుకు చేరిన రిలే దీక్షలు



దీక్ష చేస్తున్న కార్మికులను కలిసి మద్దతు తెలుపుతున్న రీజనల్ సెక్రటరీ శంకర్

**ఉక్కునగరం:** స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో తరలింపును వ్యతిరేకిస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 40వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం లీజు గడువు ముగియడంతో డిపో స్థలాన్ని ఖాళీ చేయాలని, లేదంటే రూ. 130 కోట్ల డిపాజిట్‌తో పాటు అద్దె చెల్లించాలని ఆర్టీసీకి నోటీసు జారీ చేసింది. దీనికి వ్యతిరేకంగా కార్మిక సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులకు విన్నవించారు. ఈ అంశంపై ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో డిపో ఆవరణలో జరుగుతున్న దీక్షా శిబిరాన్ని యూనియన్ రీజనల్ సెక్రటరీ పి. శంకర్ సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

---

కృషి ఉంటే మనుషులు రుషులవుతారో లేదో తెలియదు గానీ, పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చని అక్షరాలా నిరూపించారు వడ్లపూడికి చెందిన మంగా వరప్రసాద్. విద్యార్థి దశలోనే క్రీడలపై మక్కువ పెంచుకుని, ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా నిరంతర సాధన చేస్తూ అంతర్జాతీయ గుర్తింపు సాధించారాయన. కేవలం క్రీడలే కాక, ఉన్నత విద్యలో రాణించి పలు డిగ్రీలు సొంతం చేసుకోవడం ఆయన బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనం. – కూర్మన్నపాలెం

# పతకాల వరప్రసాద్..!

- విద్య, ఉద్యోగంతో పాటు **పట్టుదలతో** క్రీడల్లో రాణించిన వడ్ల**పూడి వాసి**
- అంతర్జాతీయ స్థాయిలో **400కి పైగా** మెడల్స్ సాధించి నేటి **యువతకు** ఆదర్శం



అవార్డులతో వరప్రసాద్

వడ్లపూడి నిర్వాసిత కాలనీకి **చెందిన మంగా వరప్రసాద్** తన విద్యాభ్యాసాన్ని గాజువాక **ప్రాంతంలోనే** పూర్తి చేశారు. స్కూల్ స్థాయి న**ుంచే హాకీ, వాలీబాల్,** ఫుట్‌బాల్ వంటి ఆటలపై ఆ**సక్తి** పెంచుకుని **తీరిక** సమయాల్లో సాధన చేసేవారు. **కళాశాలలో చేరిన** తర్వాత అథ్లెటిక్స్‌పై దృష్టి **సారించారు. ఆయన** ప్రతిభను నిరూపించుకుంటూ, **1984, 1986, 1987** సంవత్సరాల్లో జరిగిన అం**తర్ విశ్వవిద్యాలయ** పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థా**నాలు సాధించారు. ఆ** తర్వాత జాతీయస్థాయి పోటీ**ల్లో అడుగుపెట్టి పలు** రికార్డులను సొంతం చేసుకున్నారు.

**వెటరన్ అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ ఖ్యాతి**

2010లో వెటరన్ అథ్లెటిక్స్ వైపు దృష్టి సారించిన **మంగా వరప్రసాద్..2011లో విశాఖ జిల్లా వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్‌ను స్థాపించి దానికి నాయకత్వం వహించారు. ఈ సంఘం ద్వారా ఎందరో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి, రాష్ట్రస్థాయి పోటీల్లో పదేళ్లపాటు జిల్లాకు ఓవర్ ఆల్ చాంపియన్‌షిప్ సాధించిపెట్టారు. అనంతరం రాష్ట్ర ప్రధాన** కార్యదర్శిగా ఎంపికై తన దృష్టిని అంతర్జాతీయ పోటీల వైపు మళ్లించారు.

మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, నేపాల్, **భూటాన్, దుబాయ్, బ్యాంకాక్ వంటి దేశాల్లో జరిగిన మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు హాజరై వరప్రసాద్ అనేక పతకాలు సాధించి ఉక్కు కర్మాగారానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చారు. అంతేకాక, మలేషియా కౌలాలంపూర్‌లో జరిగిన మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు భారతదేశం తరఫున** మేనేజర్‌గా కూడా వ్యవహరించారు. ఇప్పటివరకు ఆయన 400కు పైగా మెడల్స్ సాధించి విశాఖ కీర్తిని ఇనుమడింపజేశారు.



ప్రసాద్ నాయకత్వంలో కొలంబోలో జరిగిన పోటీలకు వెళ్లిన టీం (ఫైల్)



వరప్రసాద్‌ను సత్కరిస్తున్న నగరపోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

**ఉద్యోగంతో పాటు శిక్షకుడిగా గుర్తింపు**

క్రీడల్లో రాణిస్తూనే, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మూడు పీజీలు పూర్తి చేశారు. ఆయన ప్రతిభకు ప్రభుత్వ ఉద్యోగాలు వెతుక్కుంటూ వచ్చినప్పటికీ, తల్లిదండ్రుల కోరిక మేరకు విశాఖ ఉక్కు కర్మాగారంలో చేరారు. అక్కడ కూడా క్రీడా ప్రతిభను గుర్తించిన యాజమాన్యం ఆయనను ఆల్ ఇండియా స్టీల్ ప్లాంట్స్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపిక చేసింది. ఈ పోటీల్లో వరప్రసాద్ అనేక పతకాలు సాధించడంతో, ఉక్కు కర్మాగారం ఆయనను కోచ్‌గా నియమించింది. అక్కడ అనేకమందికి శిక్షణ ఇచ్చి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు.

**రిటైర్మెంట్ తర్వాత కూడా తగ్గని పట్టుదల**

ఇటీవలే పదవీ విరమణ పొందినప్పటికీ వరప్రసాద్ క్రీడలను విడిచిపెట్టలేదు. వయస్సు మళ్లిన వారి కోసం ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇస్తున్నారు. తన ఈ స్థాయి విజయానికి ఉక్కు కర్మాగారమే కారణమని పేర్కొన్న ఆయన, ఇంకా ఎంతో మందికి శిక్షణ ఇచ్చి విశాఖకు గుర్తింపు తీసుకురావాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. శిక్షణ కోసం తగిన మైదానం లేకపోవడంతో ఉక్కు నగరం లేదా పోలీస్ స్టేడియంకు వెళ్లాల్సి వస్తుందని, తగిన వసతులు కల్పిస్తే ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# నారికేళం అ'ధర'హో



మూడు రకాలుగా విభజించి అమ్మకానికి ఉంచిన కొబ్బరి కాయలు

**అగనంపూడి:** కొబ్బరి కాయల ధరలు మునుపెన్నడూ లేని విధంగా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒకప్పుడు శ్రావణ, కార్తీక మాసాలు, లేదా దసరా ఉత్సవాల సందర్భంగా రూ.40 నుంచి రూ.50 పలికే కొబ్బరి కాయ, ఇప్పుడు పండుగలు పోయినా సరే అదే ఊపు కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఒక మోస్తరు సైజు కాయ ధర రూ.60 నుంచి రూ.70 పలుకుతుండగా, మధ్యరకం కాయలు కూడా రూ.50–60 కి తగ్గడం లేదు. చిన్న కాయ ధర సైతం రూ.30 దాటిపోయింది. దీంతో 'కొబ్బరి కాయ కొని దేవుడికి సమర్పించే బదులు... ఆ డబ్బులు నేరుగా హుండీలో వేసేయడం ఉత్తమం' అన్నంతగా భక్తులు ఆలోచిస్తున్నారు. ఈ ధరల దూకుడుకు ముఖ్య కారణం కొబ్బరి బొండాల వ్యాపారం. లేతగా ఉన్నప్పుడే రైతుల వద్ద నుంచి కాయలను కొబ్బరి బొండాల వ్యాపారులు కొనుగోలు చేసి, వాటిని ఒక్కొక్కటి రూ.40 నుంచి రూ.60 వరకు అమ్ముకుంటున్నారు. ఫలితంగా ఆలయంలో కొట్టడానికి ముదిరిన కాయలు దొరకడం కష్టమై, వాటికి తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో చిరు వ్యాపారులు సైతం రైతుల వద్ద నుంచే కాయలను రూ.25 నుంచి రూ.30కు కొనుగోలు చేయాల్సి వస్తుండడంతో, చివరకు భక్తుల జేబుకు చిల్లు పడుతోంది.

# దువ్వాడను ఆదర్శ స్టేషన్‌గా తీర్చిదిద్దుతాం

వాల్తేరు రైల్వే డీసీఎం పూజా సింగ్



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీసీఎం పూజాసింగ్

**అగనంపూడి:** దువ్వాడ రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ పథకంలో భాగంగా ఆదర్శ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని తూర్పు కోస్తా రైల్వే, వాల్తేరు డివిజనల్ సీనియర్ మేనేజర్ పూజా సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం ఆమె దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్లాట్‌ఫామ్ ఒకటి వైపు నిర్మిస్తున్న పరిపాలనా భవనం, కంట్రోల్ రూమ్, స్టేషన్ మేనేజర్ కార్యాలయాల నిర్మాణ పనులను ఆమె పర్యవేక్షించారు. అనంతరం జరిగిన 'అమృత్ సంవాద' సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అధికారుల ప్రతిపాదనలతో పాటు ప్రజా సంఘాలు, ప్రయాణికుల సూచనలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎస్కలేటర్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ షెడ్లు నిర్మించాలని, రెండు ప్లాట్‌ఫామ్ వైపులా ఫుడ్ కోర్టులు, లో కాస్ట్ దుకాణాలు ఏర్పాటు చేయాలని మరియు పార్కింగ్ ఫీజులు తగ్గించాలని కోరారు. సమావేశం అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు పూజా సింగ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంతో పాటు అధికారులు రవికిరణ్, ఎం.ఎస్. రావు, గణేష్, జయరామ్ మరియు అసోసియేషన్ ప్రతినిధులు వి. జాషువా, వీర్రాజు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నినాదాలు చేస్తూ దళిత నేత మృతి

గుండెపోటుతో కుప్పకూలిన ఆనంద్ కుమార్



దళిత ఉద్యమ నాయకుడు డెంకాడ ఆనంద్ కుమార్ (పాతచిత్రం)



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు

**గోపాలపట్నం:** దళిత, కార్మిక ఉద్యమ నాయకుడు, రిటైర్డ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగి డెంకాడ ఆనంద్‌కుమార్ మంగళవారం ఉదయం నిరసన కార్యక్రమంలో పాల్గొంటూ గుండెపోటుతో మృతి చెందారు. ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ దిగువన అంబేడ్కర్ విగ్రహం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా దళిత పోరాట హక్కుల సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. నినాదాలు చేసిన అనంతరం గుండెల్లో నొప్పి రావడంతో పక్కకు వెళ్లి కూర్చున్న ఆనంద్‌కుమార్ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన ప్రస్తుతం కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. ఉద్యమ నేత మృతిపై పలువురు నాయకులు, స్టీల్‌ప్లాంట్ కార్మిక నేతలు, సహచరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేసి మృతదేహానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# న్యాయమూర్తిపై దాడి హేయం

**పెదగంట్యాడ :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయిపై ఓ న్యాయవాది దాడికి ప్రయత్నించిన ఘటనను గాజువాక బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ చర్యను భారత రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించింది.ఈ సంఘటనకు నిరసనగా, గాజువాక కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం శాంతియుతంగా నిరసన తెలిపారు. ఇలాంటి దాడులు మళ్లీ జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి. యశోద, సభ్యులు ఆలమని సత్యవాణి గిల్బర్ట్, సీనియర్ న్యాయవాదులు రతన్‌రాజు, బి. మురళీ కృష్ణరాజు, వాడాడ శ్రీనివాస్, జి. చిరంజీవి, ఎస్. రమణబాబు, లెనిన్ పాల్గొన్నారు.



గాజువాక కోర్టు ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు.

**సీజేఐపై దాడి ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం**

**ఉక్కునగరం:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై జరిగిన దాడిని రాజ్యాంగంపై దాడి చేయడమేనని అభివర్ణిస్తూ స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు మంగళవారం ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న సీజేఐపై కోర్టు ఆవరణలోనే దాడి చేయడం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం అని పేర్కొన్నారు. దళిత, ఆదివాసీ మేధావులపై దాడులు చేస్తున్న శక్తులు ఇప్పుడు సీజేఐపై దాడికి తెగబడటం అత్యంత హేయమైన చర్య అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిందితుడైన లాయర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.తాడన్న, బయ్యే మల్లయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వై.టి. దాస్, యు. రామస్వామి, బి.డేవిడ్ ఎస్. మోహన్ బాబు, డి.పుల్లారావు, వేణుగోపాల్, ఫణీంద్రబాబు, రామన్న, మహేష్, అప్పారావు, లోవరాజు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ కూడలి వద్ద ప్రసంగిస్తున్న అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మల్లయ్య

### మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు



బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

**పెదగంట్యాడ:** మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి ఇమంది శ్రీనివాసరావు సూచించారు. జాతీయ హెల్త్ మిషన్ సౌజన్యంతో పొగాకు, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించినందుకు గాను, మండలంలోని ముగ్గురు విద్యార్థులను ప్రచారకర్తలుగా ఎంపిక చేశారు. వీరిలో గంగవరం హైస్కూల్‌కు చెందిన వాకాడ అంజలి సాయి (9వ తరగతి), నడుపూరి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి బి. త్రివేణి (8వ తరగతి), ఇస్లాంపేట హైస్కూల్‌కు చెందిన రేలంగి లక్ష్మి (9వ తరగతి) ఉన్నారు. వీరికి జిల్లా విద్య, వైద్య ఆరోగ్య శాఖాధికారులు అందజేసిన బహుమతులను ఎంఈవో శ్రీనివాసరావు మంగళవారం కార్యాలయంలో అందజేశారు.

# వీవీవీ ఉపాధ్యాయుల ఆందోళన



ఉక్కు తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసనలో వివివి ఉపాధ్యాయులు

**ఉక్కునగరం:** ఉక్కు కర్మాగారం ఆధ్వర్యంలో నడిచే విమల విద్యాలయం (వీవీవీ) ఉపాధ్యాయులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉక్కునగరంలో నిరసన చేపట్టారు. పాఠశాలను మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు, సిబ్బంది ఉక్కు తెలుగు తల్లి విగ్రహం కూడలి వద్ద బ్యానర్లు, ప్లకార్డులతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యా యులు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం తక్షణమే పాఠశాలను పునఃప్రారంభించాలని లేదా విద్యార్థులు, ఉపాధ్యాయుల భవిష్యత్తు దృష్ట్యా పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. పాఠశాల మూసివేత వల్ల సుమారు వెయ్యి మంది పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యారని, తమకు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఉక్కు యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బి. సత్యనారాయణ, అనిత, మధుసూదన్, సత్యవతి, జ్యోతి, మణి, రెజీనా, నాగవల్లి, శేషమణి, మేరీసుగుణ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

# అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలి



తహసీల్దార్ అమలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కంచాలను మోగిస్తూ నిరసన తెలుపుతున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు



సామావేశంలో సీపీఐ నాయకులు.

**పెదగంట్యాడ:** పెదగంట్యాడ మండలంలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని 75వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు మండల తహసీల్దార్ పి. అమలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెదగంట్యాడ మండలంలోని సర్వే నంబర్లు 97పి, 98పి, 99పి, 101లోని సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో గంగవరం పోర్టు, హేమాద్రి కెమికల్స్, డంపింగ్ యార్డ్ కారణంగానే ప్రజలు తీవ్ర కాలుష్యం, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే సమస్యలు మరింత పెరుగుతాయని, ప్రజల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చొరవ తీసుకుని ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసరెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, గొందేశి పైడిరెడ్డి, సింహాద్రి, పిట్టారెడ్డి, నీలాపు శ్రీనివాసరెడ్డి, కాకినాడ పెంటారావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

**వినూత్న నిరసన**

అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్స్ ఫ్యాక్టరీ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని జన విజ్ఞాన వేదిక డిమాండ్ చేసింది.ఈ డిమాండ్‌తో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎస్‌వీకే పరశురామ్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం కంచాలను మోగిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. బుధవారం నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు.

**ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం**

**పెదగంట్యాడ:** పెదగంట్యాడ 75వ వార్డు జీవీఎంసీ మైదానంలో బుధవారం జరగనున్న అంబుజా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని సీపీఐ నాయకులు ప్రకటించారు. మంగళవారం జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి ఏజే స్టాలిన్ మాట్లాడుతూ, ఈ సిమెంట్ యూనిట్ వల్ల ఈ ప్రాంతంలో కాలుష్యం పెరిగి, ఇప్పటికే గాజువాక ప్రాంత ప్రజలు పడుతున్న అనారోగ్య సమస్యలు మరింత ఎక్కువవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గంగవరం పోర్టు కాలుష్యం కారణంగా ఇప్పటికే పచ్చదనం కనుమరుగైందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డిపోలు,స్కూళ్లను సందర్శించిన ఫుడ్ కమిషన్ సభ్యుడు

**మహారాణిపేట:** జాతీయ ఆహార భద్రత చట్టం –2013 అమలుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి. కాంతారావు నగరంలో తనిఖీలు నిర్వహించారు. రేషన్ డిపోల్లో స్టాక్ బోర్డు వివరాలు లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టాక్ రిజిస్టర్‌లో లోపాలు గుర్తించి, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందేలా చూడాలని సూచించారు. అగనంపూడి జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన కాంతారావు, పిల్లలకు ఇస్తున్న గుడ్లు బరువు తక్కువగా ఉండటాన్ని గమనించి హెచ్‌ఎంను హెచ్చరించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన కుంచమాంబ కాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు, గాజువాక ఏఎస్‌ఓ కృష్ణ, ఆర్‌ఐలు పాల్గొన్నారు.


# మహర్షి వాల్మీకికి ఘన నివాళులు



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మహాత్మాగాంధీ సేవా సంఘం

**అగనంపూడి:** మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని అగనంపూడికి చెందిన మహాత్మాగాంధీ సేవా సంఘం, బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఘనంగా నివాళులర్పించాయి. 79వ వార్డు పాత అగనంపూడిలో జరిగిన ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం నేటికీ హైందవ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిత్తా జానకీదేవి, చిత్తా పద్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రతి మంగళవారం నిర్వహించే నిరుపేద, అనాథల అన్నదాన కార్యక్రమంలో భాగంగా జెర్రిపోతుల పద్మని, తోటా రోషిణీల జన్మదినాల సందర్భంగా చిత్తా రామారావు, సాయిలక్ష్మి దంపతులు అన్నదానానికి సహకరించారు.

# ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

**అగనంపూడి:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను గుటూరు శంకరరావు ఆధ్వర్యంలో జరిపారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్ గొర్లె సత్యనారాయణ, డాక్టర్ శేషు ప్రసాద్ మాట్లాడుతూ వందేళ్లుగా ఆర్‌ఎస్‌ఎస్ దేశ రక్షణ, ధర్మం కోసం నిరంతరం కృషి చేస్తోందని కొనియాడారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడారు.

# నాట్‌వెస్ట్ గ్రూప్‌లో పదిమంది విద్యార్థినులకు ఉద్యోగాలు

**అగనంపూడి:** స్థానిక విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సీఎస్‌సీ, ఐటీ విభాగాలకు చెందిన పది మంది విద్యార్థినులు ప్రముఖ సంస్థ రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ (నాట్‌వెస్ట్ గ్రూప్)లో రూ.15 లక్షల వార్షిక వేతన ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి. అరుంధతి మాట్లాడుతూ విద్యార్థుల కృషి, అధ్యాపకుల బోధనా తీరుతోనే ఇది సాధ్యమైందని కొనియాడారు.